

**త**న పెళ్ళికి రమ్మని శైలపతి నాకు ఆహ్వానం పంపలేదు. అయినా వెళ్ళేను. కారణం హైమవతి

హైమవతి యూనివర్సిటీలో నా క్లాస్ మేట్. బాగా సన్నిహితులాలు నేనంటే ఎందుకో తనకదోలాంటి గొప్ప. ఏ పని

గానీ నన్ను సంప్రదించకుండా చేసేది కాదు.

"అనుకోకుండా కుదిరిపోయింది నా పెళ్ళి. మీ నుంచి చాలా దూరంలో వుండి పోయేన్నేను. నన్నర్థం చేసుకుని సిన్సియర్‌గా సలహా యిచ్చే ఆప్తులు లెవరూ దగ్గర లేకపోయేరు. ఆయన ఫొటో అయినా మీకు పంపి మీ అభిప్రాయం తెలుసుకుందామనుకున్నాను. దానికైనా వ్యవధి లేకపోయింది. జీవితంలో అతి ముఖ్యమైన నిర్ణయాన్ని నా అంతట నేనే సాహసించి తీసుకోవాల్సి వచ్చింది. అయినా మీ హేమూ తొందరపడి ఏవి కానీ డిసైడ్ చెయ్యదని మీకు తెలుసు...

"పెళ్ళికి మీరు తప్పకుండా రావాలి. వస్తారు కదూ? ఆయన్ని చూసి మీరే మంటారో వినాలని నాకెంతో కుతూహలంగా వుంది. నిజం చెప్పాలంటే మా నాన్నకి ఈ సంబంధం చెయ్యడం అట్టే ఇష్టంలేదు వొకరకంగా నేను పూర్తి ఇష్టం చూపించబట్టే ఈ పెళ్ళి జరుగుతోంది మీరు పెళ్ళికొచ్చి— 'సి సెలెక్షన్ బాగుంది హేమూ!— అన్నారంటే చాలు— నాకెంత తృప్తిగావుంటుందో! తప్పకుండా — ఎన్ని అర్జెంటు పనులున్నా ఎలాగో వీలుచేసుకుని - తప్పకుండా వస్తారు కదూ? ఎదురు చూస్తుంటాను పెళ్ళి కానుకగా ఏదో పుస్తకం తీసుకొస్తారనుకుంటాను. మునుపు మీరిచ్చిన డికెన్స్ నవల చదివేను. చాలా బాగుంది. ఇల్యా ఎహ్రెన్‌బర్గ్ రాసిన "ది స్టార్మ్" ఇస్తానని ఇవ్వనేలేదు మీరు. వేరే కొత్త కాపీ దొరక్కపోతే మీ దగ్గరున్న పాత కాపీ అయినాసరే - మర్చిపోకుండా తీసుకురండి......"

హైమవతి ఉత్తరం చదివి ఆ ముగ్ధత్వానికి నవ్వుకున్నాను. నామీద చెక్కుచెదరకుండా నిలిచున్న గౌరవానికి ఆశ్చర్యపడ్డాను. కాని, వుత్తరంతోబాటు జతపర్చిన శుభలేఖలో హైమవతి పేరు పక్కనే వున్న వరుడి పేరు చూసి త్రుళ్ళిపడ్డాను.

శైలపతి!

శైలపతినా హైమవతి పెళ్ళాడ్డం! తల తిరిగిపోయింది. మెదడు శూన్యమైపోయింది. అసంభవం! జరగడానికి వీల్లేదు!

ఏదో సందేహం వొచ్చి మళ్ళీ శుభలేఖలోకి చూసేను. సందేహంలేదు. మా శైలపతే! - సన్ ఆఫ్ లేట్ చిన హనుమంతయ్య - అని స్పష్టంగా అచ్చువేసుంది కూడా!

దిక్కు తోచలేదు.

శైలపతి నాకు తెలీకేం? నిజానికి వాడు మాకోరకంగా బంధువౌతాడు కూడాను. వాళ్ళ కుటుంబానికీ మాకుటుంబానికీ మధ్య రాకపోకలు ప్రస్తుతం ఏమీ లేవు గాని - ఏదో దూరపు చుట్టరికం వుండడం మాత్రం వుంది. మా వాళ్ళందరిలో శైలపతి ప్రసిద్ధుడే! వాడి పేరు

చెప్తే చాలు - "అమ్మ! - వాడా -" అంటారు చాలా మంది.

కొంపలుకాల్చే కొరివి వాడ గాని తేనె పూసిన కత్తి శైలపతి. అతనికి చదువు తప్ప మిగతా ఆధునిక జీవితమంతా వొంటబట్టింది. అతని కాలేజీ దశ ముగిసీ ముగియకనే దాదాపు ముగ్గురు ఆడపిల్ల లయినా అతని గురించి హనుమంతయ్య గారికి తమ సొద వెళ్ళబోసుకోవడం జరిగింది. "ఇవన్నీ మీ అబ్బాయి నాకు రాసిన ఉత్తరాలు. మిమ్మల్నొప్పించి నిన్ను పెళ్ళాడతానని వీటిలో చాలాసార్లు రాసేరు. కావలిస్తే తీసి చదువుకోండి - మీ అబ్బాయి మాటల్ని నమ్మొచ్చంటారా?—" అని నిలదీసి అడిగిందొక అమ్మాయి. "వొద్దంటున్నా వెంటబడి తిరిగేడు ప్రేమిస్తున్నాట్ట. నా కిష్టం లేదు పొమ్మంటే - పగబట్టి నా పేరు గోడమీద కెక్కించేడు. ప్రిన్సిపాల్‌కి రిపోర్టు ఇస్తే ఇంకా అల్లరౌతుంది. అందు కేనా మీ అబ్బాయిని కాలేజీకి పంపిస్తున్నారు మీరు?—' అని ప్రశ్నించిందొకామె. ఈ కాలేజీ ఆడపిల్లలుకాక, పూళ్ళోంచి ఇంకో పడుచు వొక మధ్యాహ్నంపూట హనుమంతయ్యగారి దగ్గరికి ఆయాసంగా నడుచుకొచ్చి— "మావయ్యా! - మీ అబ్బాయి నన్నీగతికి తెచ్చేడు—" అని నెత్తిన నెత్తిన సిటి కుండ పగలగొట్టుకుంది. వీళ్ళందరికీ చెప్పాల్సిన వన్నీ చెప్పి, ముట్టజెప్పాల్సినవి ముట్టజెప్పేసరికి హనుమంతయ్యగారికి తలప్రాణం తోక్కొచ్చింది. మరుసటి దినం కొడుకుని చేరబిల్చి 'నిర్వాహకం యిహ చాలుగాని-చదువాపెయ్-' అన్నాడు.

వాయస్!" అన్నాడు శైలపతి. ఆపేసేడు. తండ్రి సలహామేరకి బిజినెస్‌లోకి దిగేడు. వేం మదుపుని ఆరున్నరేండ్లలో లక్షల వ్యాపారానికి ఓప్పేసేడు. ఏమాటకామాటే చెప్పుకోవాలి. శైలపతి వ్యవహారజ్ఞుడూ కార్యదక్షుడూను

పెద్దమనుషుల్లో పెద్దమనిషే శైలపతి. కాని అతనికున్న చిన్న బుద్ధులేమిటో అతన్ని వ్యక్తిగతంగా ఎరిగున్నవాళ్ళకి తప్ప తెలీదు.

నా మటుకు నాకు అతనితో పరిచయాధిక్యత లేకపోయినా, బంధువర్గం లోని వాడడంవల్ల అతని చర్యలగురించి ఫోగట్టా ఎప్పటికప్పుడు అందుతూనే వుండేది, ఏదో పనిమీద వాళ్లూరు వెళ్ళినప్పుడు. చట్టపు చూపుగానే నేనతణ్ణి చూడ వెళ్ళిన మాటా నిజమే! నన్నెరగనట్టుగా శైలపతి ఎప్పుడూ ప్రవర్తించలేదు అతిథి సత్కారాలకూ లోపం చెయ్యలేదు. మా కుటుంబ సభ్యుల గురించీ, వాళ్ళ యోగక్షేమాల గురించీ, ఇతర బంధువర్గం గురించీ కుశల ప్రశ్నలు అడక్కానూ పోలేదు. కాని, ఈ అన్నిటి వెనకా శైలపతిలో వొక

'సాంఘిక నిర్లిప్తత' గూడుకట్టుకున్నట్టు గోచరించింది. "ఏదో ఖర్మకొద్దీ నాకూ మీకూ ఏదో వొకలాంటి బంధుత్వం వుండి తగలడింది. అందుకోసంగానీ - లేకపోతే - నేనేమిటి - నీలాంటివాళ్ళతో ఇంత సన్నిహితంగా మాట్లాడ్డం ఏమిటి ?—" అని అతను పెదవి కదిపి అనలేదుగాని, అతని వైఖరిలో ఆ భావం తేటతెల్లమౌతూనేవుంది. ఇది మాత్రం నేను సహించలేకపోయేను. లోకం అతణ్ణొక మహామహుణ్ణిచేసి కర్పూరపు హారతులుపట్టొచ్చు. కాని వ్యక్తిగతంగా - నైతికంగా - అతనెంతటి నికృష్టుడో నాకు తెలుసుగదా ! మనిషి మనిషికీ మధ్య నిశ్శబ్ద అంతర్యుద్ధాలు జరగటం నాకిష్టంలేదు. శైలపతి బ్రతుకు శైలపతిది. బంధు మర్యాదగానైనా సరే అతణ్ణి కలవకూడదని నియమం పెట్టుకున్నాను. దాదాపు మూడున్నర సంవత్సరాలైంది అతణ్ణి చూసి.

"శైలపతికి వయసు ముదురుతోందే - ఇంకా పెళ్ళెందుకు చేసుకోలేదో ? !..." అని మా వాళ్ళలో నానారకాల వూహాగానాలూ బైలువేరేయి. అందుగురించి నేనుమాత్రం అట్టే ఆశ్చర్యపోలేదు. శైలపతి లాంటివాళ్ళు అంతచప్పునే పెళ్ళిచేసుకుంటారనీ నేననుకోలేదు. కాని "చేసుకుంటాడు - ఎప్పుడో వొకప్పుడు చేసుకుంటాడు — కానీ, అతనిక్కాబోయే భార్య ఎవరోగాని - పాపం.. దురదృష్టవంతురాలు..." అనుకున్నాను.

ఎంత విడ్డూరం ! దారుణం కదూ ? ఆ దురదృష్టవంతురాలు హైమవతే ఎందుకు కావాలి ? విధికృతమంటే ఇదే కాబోలు !

కాని-

హైమవతి వుత్తరంలోని పంక్తులు కొన్ని నన్ను నిజంగా కలవరపెట్టేయి. తండ్రికి ఇష్టంలేదుట. తను మాత్రం 'పూర్తి ఇష్టం' చూపించిందిట అందుకే ఈ పెళ్ళి జరుగుతోందిట. దీన్నేమనాలి? ఇదీ విధికృతమేనా ? హైమవతి పక్షాన ఆలోచిస్తే- స్వయంకృతమా ? ఇదేవీ కాక - శైలపతి వేపునుంచిచూస్తే - హైమవతిలాంటి రూపవతీ గుణవతీ లభించడం అతని అదృష్టమే కాదూ ? ఈ ఆఖరు పాయింటు కూడా అవతలుంచి పరిశీలిస్తే... ఈ తర్జన భర్జనంతా నాకెందుకు తప్పనట్టూ? అబ్బాయి అమ్మాయిని చేసుకుంటున్నాడు. అందుకు అమ్మాయి ఇష్టపడుతోంది. మధ్యన ఇంకొకరూ, ఇంకొకరూ తలదూర్చట మెందుకు ? హైమవతికి నామీద ఎంత సద్‌గౌరవం వున్నా వుంటుందిగాక —ఆవిడ వివాహం విషయంలో ఆవిడంతట ఆవిడే వొక నిర్ణయాని కొచ్చిన తర్వాత - దాన్ని పూర్వపక్షం చెయ్యడానికి నాకేం అర్హతుంది ? ఏ అధికారముంది ?. అందుచేత—

శైలపతీ, హైమవతుల వివాహం అనివార్యం. నివారించాల్సిన అవసరమూ

కనిపించదు. దీనిగురించి నేను బుర్ర బద్దలు చేసుకోనవసరంలేదు ఇష్టముంటే నేను పెళ్ళికి వెళ్ళొచ్చు. లేకుంటే మానొచ్చు.

పెళ్ళికి రెండురోజులు ముందుదాకా ఆలోచిస్తూనేవున్నాను. వెళ్ళాలా? మానాలా?

ఆలోచనలోనే బెర్త్ రిజర్వ్‌చేసేను. ఆఖరి క్షణంలో వెళ్ళాలనిపిస్తుందేమోనని అనుమానం

ఎదురు చూస్తూనే వుంటుంది హైమవతి. ఎహ్రెన్‌బెర్గ్ నవల తెమ్మంది కూడాను. చూసి చాలా రోజులైంది. మళ్ళీ ఎప్పటికో కదా!

ఆలోచనల్లోనే రైలెక్కేసేను.

తీరా గంటన్నర ప్రయాణం చేసేక మళ్ళీ మనసు పూగింది. నేను వెళ్ళడం శైలపతికి ఇష్టంవుండదు. వాడు ఇబ్బందిగా ఫీలౌతాడు. లేని మర్యాద కూడబెట్టి కనబర్చడానికి ప్రయాస పడతాడు కాబోలు

అన్నీ వ్యర్థపుటాలోచనలు. నాది వ్యర్థప్రయాణం కూడానేమో!

ఏం? నేను వెళ్ళకపోతే హైమవతి పెళ్ళి ఆగిపోతుందా? అనుకున్నాను.

* * *

మన ఆలోచనల్ని మనమే నమ్మడానికిలేదు, ఒక్కోసారి

నేను వెళ్ళకపోతే హైమవతి పెళ్ళి ఆగిపోతుందా? అనుకున్నాను కదూ!

నేను వెళ్ళేను.

హైమవతి పెళ్ళి ఆగిపోయింది.

నా జీవితంలోకల్లా అతి ఘోరమైన సంఘటన.

వర్ణనకందని అనుభవం.

అవును, ముహూర్తానికి ముప్పావు గంట ముందుగా అంత దారుణం జరిగింది.

టేక్సీ దిగి పెళ్ళింట్లోకివెళ్తూ నేనెంతో ఆనందంగా వున్నాను.

నచ్చిన వాణ్ణి పెళ్ళాడుతోంది హైమవతి.

శైలపతి నాకు నచ్చుడు అయితేనేం?

వాళ్ళిద్దరూ పరస్పరం ఇష్టపడాలి.

ఆ తర్వాత సర్వప్రపంచం అయిష్టం చూపినా వ్యతిరేకించినా – పెళ్ళాడాలను కుంటే తప్పకుండా పెళ్ళాడే తీరాలి.

మనుషులు ఆశయానికి నిలబడాలి. హేమూ అలా నిలబడుతుంది.


"నిండు గుండెగల స్నేహితురాలుగా హేమూని చూసి నేను గర్వించవచ్చు–" అనుకున్నాను పెళ్ళిపందిట్లో తచ్చాడుతూ.

పెళ్ళికి ముందే హేమూనొకసారి కలుసుకోవాలి.

ఎలా?

ఎక్కడుంటుందో?...

హఠాత్తుగా కనిపించాడు శైలపతి. పేరుపెట్టి పిలిచేడు కౌగిలించుకున్నంత




పనిచేసేశు. "ఇప్పుడా రావటం? మామీదింత చిన్న చూపు కూడదు...". అంటూ నిష్ఠూరం చేసేడు

ఆశ్చర్యపోయేను. అతన్నుంచి ఆహ్వానం లేదు నాకు.

హైమవతి పిలవగానే నొచ్చేనని అతనికి తెలుసు

నా రాక అతనికి అంత ఆనంద దాయక మౌతుందని నేనూహించలేదు.

అతని ముఖంలో వెలిగిన వెలుగుల అసలు తాత్పర్యం నాకప్పుడు బోధ పడలేదు.

"ముహూర్తానికింకా టైముందిగా... అయినా... నే వెళ్ళి పెళ్ళికొడుకు ముస్తాబు పూర్తిచేసుకోవాలి........." అన్నాడు శైలపతి. తొందరగా ...... "హేమూ-అదిగో-అగదిలో వుంటుంది" అని ఒకగదికేసిచూపించి వెళ్ళిపోయేడు.

గదిలో స్నేహితురాండ్ర మధ్యనుంది హైమవతి.

నేను కనిపించగానే ఆమె ముఖం ఒక్కసారిగా కాంతివంతమైంది. "వొచ్చేరా!..." అంటూ లేచి వచ్చింది.

హైమవతి నడకలో కొత్తదనం వుంది. మనిషికూడా కొంచెం మారింది. మునుపటి చలాకీతనం స్థానంలో కించిత్తు గాంభీర్యం కనిపిస్తోంది.

"నిన్నంతా మీకోసం చూసేను... ఇహ రారేమోననుకున్నాను... ఎలాగైతేనేం వొచ్చేసేరు..."

మేడమీది గదుల వారగా నడుచుకుంటూ వెళ్ళి బాల్కనీ దగ్గర ఆగేం. జాజిమల్లె తీగల చిరు పరిమళం హైమవతిని చుట్టుకుని ఇబ్బంది పెట్టింది. నవ వధువుకు సహజమైన సిగ్గుతో తలవాల్చిందామె

చాలా రోజులుగా నాలో తడబడుతూ

వున్న నాలుగు ముక్కలూ చెప్పే సేశ్నేను...

"జీవితంలో నువ్వు సుఖపడాలి హేమూ!... నీకు ఏ కష్టమూ కలక్కూడదు... బాధనేదే నీకు తెలీకూడదు... నువ్వెప్పుడూ సంతోషంగా నవ్వుతూ వుండాలి..."

నా మాటలు విని నవ్వింది హైమవతి మూర్ఖణి సంతోషంగానే నవ్విందనుకున్నాను.

కానుకగా తెచ్చిన పుస్తకం ఇచ్చేను.

"థేంక్యూ!..." అంది మెరిసే కళ్ళతో హైమవతి.

అంతలో ఉరుము ఉరిమింది.

"చూడండి!... చూడండి...! అనుమానం నిజమే!..."

మూర్ఖుణ్ణాయి చూసేను

నిప్పులు చిమ్మే కళ్ళతో నాకేసీ హైమవతికేసీ చూపిస్తున్నాడు శైలపతి అతని వెనక చిన్నా పెద్దా ఆడా మగా- పెళ్ళికి వచ్చినవాళ్ళలో ముప్పాతిక భాగం పైనే ఉన్నారు.

"రెణ్ణిమిషాల్లో పీటలమీద కూచోబోతూ కూడా... చూసేరా... ఏమో అనుకున్నాను... నా ఫ్రెండ్సంతా చెప్తే నమ్మలేదు నేను..."

నన్నూ హైమవతినీ జనం చుట్టుముట్టారు.

హైమవతి ముఖం వివర్ణమైపోయింది. ఆమె నిలువెల్లా వణికిపోయింది.

నాకేమీ పాలుపోవడంలేదు దిక్కు తోచడంలేదు. అసలేమీ అర్థంకావడమే లేదు...

బిగ్గరగా కేకలేస్తున్నాడు శైలపతి... "అడగండి!... మీరే అడగండి!... ఏమంటారు... ఇంకేమంటారిద్దరూ!... దొరికిపోయేరు!.. థేంక్‌గాడ్, ఎంతలో గండం గడిచింది నాకు!..." చేతులు తిప్పుతూ రోషంగా అభినయం కూడా చేస్తున్నాడు శైలపతి.

గుంపులోంచి వొస్తూన్న వొక్కొక్క మాటవల్లా నాకసలు విషయం మెల్లి మెల్లిగా బోధపడసాగింది.

"అసలు వీళ్ళిద్దరికీ కాలేజీలో పరిచయంట—"

"స్నేహంట-"

"స్నేహమేం ఖర్మ... అంతాను..."

"ఆ... ఆ... అదీను... ఇప్పుడు మూడో నెలా దాటింది .."


"గుప్‌చిప్‌గా శైలపతిని ట్రేప్ చేసెయ్యాలనుకుంది చిలక..."

"బెడిసికొట్టింది..."

"బేడ్‌లక్!... అయినా..."

"శైలం అదృష్టవంతుడేస్మీ! అదేదో ఇప్పుడే బైటపడింది... అది నిష్ఠూరం మేలని..."

తల తిరిగిపోయింది నాకు. మెదడు కాలిపోయింది. మనసు చీలింది గుండె వణికింది. ఆత్మ రగిలింది



క్షణంలో పెళ్ళిపందిరంతా నానా గందరగోళం అయిపోయింది.

తన కూతురు ఏ పాపమూ ఎరగదని నెత్తీనోరూ మొత్తుకుని హైమవతి తండ్రి చెప్తున్నా వినిపించుకున్న వాళ్ళు లేరు.

మగపెళ్ళివాళ్ళంతా అయిదు నిమిషాల్లో పెట్టే బేడా సర్దుకున్నారు

గదిలోకెళ్ళి గడియ వేసుకుంది హైమవతి. తలుపు తియ్యలేదు.

శైలపతికి నచ్చజెప్పడానికి ఎన్నో రకాలుగా ప్రయత్నించేను.

ఆ పదినిమిషాల్లోనూ అతనంటే నాకు అసహ్యం అంతకంతగా పెరిగిపోతోంది. అయినా తప్పదు గనక దిగమింగుకున్నాను.

నా మాటలేవీ శైలపతి వినిపించుకోలేదు ఎందుకంటే_ వినిపించుకోదలచలేదతను ఆఖరుగా మూడు ముక్కలే అన్నాడతను— "బ్రదర్! నువ్వూ మా బంధువర్గంలో వాడివే! మనకూ మనకూ మధ్య అపార్థాలు కూడవు. నన్ను వల్లో వెయ్యడం సులువుకాదు. ఇట్లాంటి సిల్లీట్రిక్స్ చెయ్యొద్దని మీ పతివ్రతకు నువ్వే చెప్పు... ఆవిణ్ణి పోషించుకోవడానికి డబ్బూ గిబ్బూ అవసరమైతే నా దగ్గిరికి రా!... ఎంత అపరాత్రయినా ఎంత ఎమౌంటైనా సర్దుతాను... అంతేగాని... ఈ మారు బేరాల తతంగాలొద్దు... బెడిసి గొడుతుంది..."

వ్యంగ్యంగా నవ్వి వెళ్ళిపోయేడు శైలపతి.

అతని మిత్రబృందమంతా కూడా పటాటోపంగా నిష్క్రమించింది.

సిగ్గుతో అవమానభారంతో అశక్తతతో కృంగిపోయేన్నేను.

తెలివి తెచ్చుకుని హైమవతి గది తలుపులు తట్టి ఆమెను వెలుపలికి రమ్మని బ్రతిమిలాడుకున్నాను వొక్కసారి తలుపులు తెరుచుకున్నాయి. అగ్ని గోళంలా మండుతోంది హైమవతి ముఖం– "ఇప్పుడు చావను నేను. మీరంటే గౌరవం నాకు. నా మాట మన్నించండి. ఇక్కణ్ణుంచి తక్షణం వెళ్ళిపొండి— ప్లీ...జ్..."

నా ముఖంమీదే తలుపులు ఠళ్ళున మూసుకున్నాయి.

* * *

ఊరికి తిరిగొచ్చి పదిహేను రోజులు నరకం అనుభవించేను.

హైమవతినుంచి వొకరోజొక పార్శిల్ వొచ్చింది. ఉత్సుకతగా విప్పిచూసేను. నేనిచ్చిన పెళ్ళికానుక "ఎహైన్ బెర్గ్" నవల

"నాకు నీ కానుక
నీకు నా కానుక
అభాగ్యురాలు
హేమూ..."

గుండె దడదడలాడింది.

ఆ రాత్రి నా గదిలో కోటి నరకాలు.

మరుసటి దినం హేమూనుంచి ఉత్తరం.

"... మీనుంచి కొన్ని విషయాలు దాచేను అందుకే శిక్ష అనుభవించడం. శైలపతితో నాకు చాలా రోజులుగా పరిచయం, ఏదో ఉద్యోగం కోసమని వెళ్ళేనతని దగ్గరికి. పెళ్ళిచేసుకుంటానని లోబరచుకున్నాడు. అతన్ని మనస్ఫూర్తిగా నమ్మేను. అయినా పెళ్ళిచేసుకుంటాడు కదా అనుకున్నాను...

మీతో పరిచయమున్నట్లు అతనికి నేనే చెప్పేను. నా పెళ్ళికి మీరొస్తారనీ చెప్పేను.

అతను నన్ను మోసంచేసేడు. ఈగతి తప్పదని నాకు తెలుసు. చావంటే భయంలేదు.

ఏమీ ఎరగని మీరు– నాతో పరిచయం వున్న పాపానికి– అల్లరి పడ్డారు...

నన్ను మన్నించండి.

హైమవతి– ఈ హైమవతి మీకు గుర్తుంటుందా ?"

నేను చచ్చిపోయేప్పుడైనా సరే– హైమవతి నాకు గుర్తుండి తీరుతుంది. నాకు తెలీకుండా నేను ఆమెను ఎంతగా ప్రేమించేననీ !

అపవాదులకు బలైన అసంఖ్యాక అబలల్లో హైమవతి వొకతె ! కాని– విచిత్రం !—

హైమవతి విషాదాంత కథలో నా పాత్రేమిటి ??

——